క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్యాపిలి: మండల పరిధిలోని బోయిన్‌చెర్వుపల్లి వద్ద ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాచర్ల, బోంచెర్వుపల్లి, సీతమ్మతండా, బూరుగల, నేరేడుచెర్ల, మునిమడుగు, అలేబాదు, అలేబాదు తండా తదితర గ్రామాల నుంచి వచ్చిన 835 మందికి హైదరాబాద్ యశోద ఆస్పత్రి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజీఎం మల్లికార్జునరెడ్డి, పీఆర్ఓ కోటేశ్వరరావు, ఎల్‌జీఎం సాంబశివారావు, ప్రిన్సిపాల్ శ్రీకుమరన్, వైద్య సిబ్బంది రజనీకాంత్, మానసరెడ్డి, నితిన్ చంద్ర, ధర్మతేజ పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు డాక్టరేట్



డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జి.చంద్రశేఖర్ రాజస్థాన్ రాష్ట్రంలోని సన్‌రైస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ''రాయలసీమ జిల్లాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడల్లో పాల్గొనడానికి గల అవకాశాలు, అవరోధాలు ఒక విశ్లేషణ'' అనే అంశంపై ఆచార్య నల్లెల శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన పత్రాలు సమర్పించారు. శనివారం ఆయన్ను ప్రిన్సిపాల్ భారతి, తోటి అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన ఆకుమల్ల విద్యార్థులు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 18వ తేదీ కర్నూలులో జరిగిన వాలీబాల్ జిల్లా స్థాయిలో పోటీల్లో పాఠశాలకు చెందిన సురేఖ, సౌమ్య ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మనోహర్ బాబును అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మమత

డోన్ టౌన్: విద్యార్థులు సైబర్ నేరాలు, లోన్ యాప్‌తో జాగ్రత్తగా ఉండాలని డోన్ రూరల్ ఎస్‌ఐ మమత అన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు, ఫోన్ కాల్స్, సోషల్ మీడియా, ఆన్‌లైన్‌లో వచ్చే లింక్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలు సమాజంలో ఎదురవుతున్న సమస్యలపై ధైర్యంగా స్పందించాలని తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరిస్తూ ఇలాంటివి ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, టీచర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. పోక్సో, బాలికల సంరక్షణ చట్టాలు, రోడ్డు భద్రత నియమాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో 100 లేదా 112, సైబర్ క్రైంకు గురైతే 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ చంద్రకాంత్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దారిలో పారిశుద్ధ్య పనులు



మెట్లు నిర్మిస్తున్న కార్మికులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో బ్రిడ్జి కింద భాగం నుంచి శ్మశాన వాటికకు చేరుకునే దారిలో శనివారం సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను తీసుకెళ్లాలంటే కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉండేది. బ్రిడ్జి కింద నుంచే శ్మశాన వాటికకు చేరుకోవాల్సి ఉంటుంది. అయితే దిగేందుకు సౌకర్యం లేక అవస్థలు పడుతుండేవారు. ప్రస్తుతం చెత్తను తొలగించి సులభంగా దిగేందుకు మెట్లు ఏర్పాటు చేయించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

ప్యాపిలి: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సరైన చికిత్స అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి శారదాబాయి ఆదేశించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న చికిత్స గురించి వైద్యాధికారి నితీష్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది తమ పరిధిలోని గ్రామాల్లో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి రెఫర్ చేయాలన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

చిన్న నోటు.. పెద్ద కష్టం

- మార్కెట్లో తగ్గిన రూ.10 నోట్ల చెలామణి
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, ప్రజలు



పది రూపాయల నోట్లు

కొలిమిగుండ్ల: పది రూపాయల నోటు చిన్నదే అయినా ప్రతి ఒక్కరికీ చాలా అవసరం. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో లభించడం లేదు. ఇప్పటికే చలామణిలో ఉన్న చిరిగిన, మురికిపట్టిన నోట్లు తప్ప కొత్తవి రావడం లేదు. మార్కెట్‌లో నడుస్తున్న రూ.10 నోట్లు జేబులో పెట్టుకుంటే చిరిగిపోయే స్థితిలో ఉన్నాయి. మార్కెట్‌లో రూ.10 నోటు కనిపించడం గగనంగా మారుతోంది. దీంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 1,2,5,10 రూపాయల నాణేలు గతంలో చెలామణిలో ఉండేవి. ధరల పెరుగలతో 1,2,5 రూపాయల నాణేలు ఉన్నా 5,10 నాణేల వినియోగం పెరిగిపోయింది. ప్రస్తుతం ఆయా నాణేలతో పాటు రూ.10 నోట్ల చెలామణి భారీగా తగ్గింది. చిరువ్యాపారుల మొదలు కూరగాయలు, ఫ్యాన్సీ దుకాణాలు, హోటళ్లు, టీకొట్లు మొదలుకొని ఆటోలు, బస్సుల్లో రూ.10 నోటుకు ప్రాధాన్యం పెరిగింది. పది నోట్లు అందుబాటులో లేక వ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు. చిరు వ్యాపారుల వద్ద రూ.100 నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి చిల్లర ఇచ్చేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. చిరిగిన నోట్లను ఇటు వ్యాపారులు, ప్రజలు తీసుకునేందుకు ఇష్టపడటం లేదు. ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లపై పది నోట్ల ప్రభావం తీవ్రంగా చూపుతుంది.

డిజిటల్ పేమెంట్ వైపు మొగ్గు

2020లో కరోనా రావడంతో డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజలు సైతం ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటు పడ్డారు. టీ స్టాల్, హోటల్, నిత్యావసర సరుకులు వినియోగించే అంగళ్లు మొదలు ఎంత ఖరీదు చేసే వస్తువు కొనుగోలు చేసినా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. రూ.10 నోట్ల చెలామణి మార్కెట్‌లో అంతంత మాత్రంగానే ఉండటంతో వ్యాపారులు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ సర్వర్‌లపై భారం పడిన సమయంలో పని చేయని సమయంలో వ్యాపారులు, ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

ఎందుకు ఇలా జరిగింది: రూ.10 నోట్లు మార్కెట్‌లో పెద్దగా కనిపించకపోవడంతో ఎందుకు ఇలా జరిగిందో తెలియక వ్యాపారులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.147 కోట్ల రూ.10 నోట్లను ముద్రించింది. అలాగే 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.75 కోట్ల చొప్పున ముద్రించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీంతో రూ.10 నోట్ల ముద్రణను క్రమేణా తగ్గించినట్లు తెలుస్తోంది. కరోనా తర్వాత ఆర్‌బీఐ క్లీన్ మనీ పథకాన్ని చేపట్టింది. ఈ సమయంలోనే పాత చిరిగిన నోట్లను రద్దు చేశారు. మనీ కంట్రోల్ నివేదిక ప్రకారం రూ.20 నోట్ల కంటే రూ.10 నోట్లను తయారు చేసేందుకు ఎక్కువఖర్చు అవుతుందని తెలిసింది. 10 రూపాయల నోట్లు మార్కెట్‌లోకి రాకపోవడానికి ఇది ఒక కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కిక్కిరిసిన మద్దిలేటిస్వామి ఆలయం



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. శుభ ముహూర్తాలు కావడంతో చిన్నారుల కేశఖండన, వివాహాలు నిర్వహించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వారి బంధుగణంతో పాటు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు ముందుగా ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో సాగైన వివిధ పంటల్లో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మండలంలోని గుంజలపాడు గ్రామంలో శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఏఓ మాట్లాడుతూ.. ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించాలన్న తపనతో రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారని తెలిపారు. అధిక ఎరువుల వాడకంతో భూమిలో పోషకాలు నశించి దిగుబడులు తగ్గిపోతాయన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా రైతులు ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవిస్తే ఈ పంట నమోదు ఆధారంగానే నష్ట పరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ పంటల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు. పశు వైద్యాధికారి కృష్ణకుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి

22 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 22న రేవనూరు, గుళ్లదూర్తి, 23న చిన్నకొప్పెర్ల, కోవెలకుంట్ల–2, 24న బిజనవేముల, సౌదరదిన్నె, కోవెలకుంట్ల–3, 25న భీమునిపాడు, కోవెలకుంట్ల–4, కోవెలకుంట్ల–5 గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు ఉంటాయని వెల్లడించారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్, కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

సారా బట్టీలు ధ్వంసం

బేతంచెర్ల: బుగ్గానిపల్లె తండా సమీపంలోని కొండల్లో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు సీఐ వెంకటేశ్వరావు శనివారం తెలిపారు. మూడు సారా బట్టీలు, 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. గ్రామానికి చెందిన స్వామినాయక్, దేవనాయక్, రమ్లీబాయి నుంచి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు.

శిక్షణకు స్పందన కరువు



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

బనగానపల్లె రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని పొదుపు భవనంలో మండలంలోని ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఇస్తున్న శిక్షణ తరగతులకు స్పందన కరువైంది. రెండో రోజు శిక్షణ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11 గంటలైనా కేవలం ముగ్గురు మాత్రమే హాజరు కావడంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనం ఇచ్చాయి. 11 గంటల తర్వాత వచ్చిన కొద్దిమందికే ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్ శిక్షణ ఇచ్చి ముగించారు. డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు బాలాంజనేయులు, మహేష్, శివశంకర్‌నాయక్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బైక్ దొంగలు?

కోవెలకుంట్ల: పట్టణంలోని సాయినగర్‌లో ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి జరిగిన బైక్ చోరీ కేసులో దొంగలను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాలనీలోని దూదేకుల దస్తగిరికి చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు అపహరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దొంగలను గుర్తించి వారి వద్ద నుంచి ఈ కేసుతోపాటు మరికొన్ని బైక్ చోరీలకు సంబంధించి దాదాపు ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



యనకండ్లలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ



అవుకు: సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

బనగానపల్లె రూరల్: పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని యనకండ్ల, హుసేనాపురం, ఎర్రగుడి, ఇల్లూరుకొత్తపేట గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మంజూరైన నిధులతో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణంతో పాటు పలు మౌలిక వసతులను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఏఈ రమణ, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ మక్బుల్‌హుస్సేన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

బేతంచెర్ల: మండలంలోని యంబాయి, శంకరాపురం, సీతారామాపురం గ్రామాల్లో రూ.55 లక్షలతో చేయనున్న అభివృద్ధి పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎండీఓ ఫజుల్ రహిమాన్, ఈఓఆర్డీ మల్లికార్జున, పంచాయతీరాజ్ ఇంజినీర్ మహేష్ ఏపీఓ శేషన్న పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కోవెలకుంట్ల: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు అన్నారు. శనివారం మండలంలోని గుళ్లదూర్తి, పొట్టిపాడు గ్రామాల్లో పల్లె పండుగ గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభల్లో వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

అవుకు: గ్రామాల అభివృద్ధికి అందరూ కలసికట్టుగా కృషి చేద్దామని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని మంగంపేట, తండా గ్రామాల్లో సర్పంచ్ లక్ష్మీ తులసమ్మతో కలిసి సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఒక్కో గ్రామంలో రూ.10 లక్షలతో సీసీరోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హౌసింగ్ ఏఈ క్రిష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

కుందూ నదిలో తగ్గని వరద

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో ఆరు రోజుల నుంచి కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం కోవెలకుంట్ల మండలంలో 20 మి.మీ, అవుకు మండలంలో 11.2 మి.మీ, కొలిమిగుండ్లలో 4.2 మి.మీ, దొర్నిపాడు మండలంలో 3.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు తోడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలతో కుందూలో వరద ఉధృతి కొనసాగుతోంది. నదికి మరింత వరద పెరిగే ఆస్కారం ఉండడంతో నదీ పరివాహక లోతట్టు ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు. నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నది పరిసర ప్రాంతాలకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు.

గొర్రెలకు నట్టల వ్యాధి నివారణ మందు

డోన్: మేకలు, గొర్రెల్లో నట్టల వ్యాధి నివారణ కోసం ఈనెల 18 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలో సుమారు 10వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించనున్నట్లు పేర్కొన్నారు.

రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలి

ప్యాపిలి: ఎంటీఎస్(మినిమం టైం స్కేల్) ఉపాధ్యాయులను రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించాలని యూటీఎఫ్ నాయకులు అబ్దుల్ లతీఫ్, బొజ్జన్న, నరసింహారెడ్డి, రమేశ్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులను గత ప్రభుత్వం మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులుగా నియమించినట్లు తెలిపారు. ఉద్యోగంలో చేరిన కొద్ది నెలల్లోనే అనేక మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందారని తెలిపారు. మరికొందరు ప్రమాదాల బారినపడి, అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక లబ్ధి చేకూరలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించి అన్ని రకాల ప్రయోజనాలు వర్తింపచేయాలని కోరారు.

చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యం

- జడ్జి రాహుల్ అంబేడ్కర్



న్యాయమూర్తిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చదువుకున్న వారికి సమాజంలో గౌరవం ఉంటుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ అన్నారు. శనివారం డోన్‌లోని పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు పెద్దలు, ఉపాధ్యాయులతో గౌరవ మర్యాదలు కలిగి ఉండాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే బాల నేరస్తులుగా శిక్ష అనుభవించడంతో పాటు సమాజంలో సముచిత స్థానం ఉండదన్నారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ప్రణాళికబద్ధంగా చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. నిత్యం తెలుగు, ఆంగ్ల పత్రికలు చదివి జ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పొందితే మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు జడ్జిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్‌ఐ నరేంద్రకుమార్, న్యాయవాది నరసింహులు, హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మయ్య, వెంకటరమణ, బాబు, వెంకటలక్ష్మీ, రాధ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం పరిశీలన



విద్యార్థినులతో జడ్జి అబ్దుల్ రహిమాన్

కోవెలకుంట్ల: పట్టణంలోని బాలికల వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు, వసతులపై కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ ఆరా తీశారు. శనివారం సాయంత్రం స్థానిక వెలగటూరు రస్తా, సంతపేటలో ఉన్న బాలికల వసతి గృహాలను న్యాయమూర్తి సందర్శించారు. సౌకర్యాలు, వసతులపై విద్యార్థులతో మాట్లాడారు. జడ్జి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, కాశీంసాహెబ్, రాజశేఖర్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాల నమోదు

బేతంచెర్ల: ఆధార్ కార్డు తరహాలో విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్) కార్డులు అందజేయనున్నట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. ఒకే దేశం.. ఒకే గుర్తింపు కార్డులో భాగంగా కేంద్రం ఈ కార్డులను అందజేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. శనివారం ఆయా పాఠశాలల విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్డు ద్వారా విద్యార్థుల సమగ్ర సమాచారం తెలుస్తుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు 40 శాతం నమోదు ప్రక్రియ పూర్తయ్యిందన్నారు.

గోవుల రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

అవుకు: దేవాలయాలకు చెందిన ఆవులను కొందరు వ్యక్తులు కబేలాలకు తరలిస్తుండగా అవుకు ప్రజలు అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. అవుకు పట్టణంలో దేవాలయాలకు చెందిన ఆవులు పట్టణంలో సంచరిస్తుంటాయి. శుక్రవారం రాత్రి కొందరు వ్యక్తులు మార్కెట్ ఏరియాలో తిరుగుతున్న దేవాలయ ఆవులను బొలెరో ట్రక్‌లోకి ఎక్కిస్తుండగా ప్రజలు అడ్డుకున్నారు. ఆవులను ఎక్కడికి తీసుకెళ్తున్నారు, ఎందుకు తీసుకెళ్తున్నారు అని నిలదీశారు. దీంతో విషయం బయటపడింది. ఆవులను తీసుకెళ్తున్నది కబేలాలకని తెలిసి వారిని ప్రశ్నించారు. అవుకుకు చెందిన వారే ఆవులను రూ.1.2లక్షలకు అమ్మేశారని.. ఏదైనా సందేహం ఉంటే అమ్మినవారిని అడగండంటూ సమాధానం ఇచ్చారు. పట్టణానికి చెందిన కొందరు ఆవులను అమ్మలేదని.. మేపడానికి మందకు తరలిస్తున్నామని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. దీంతో ఆటోలో తరలిస్తున్న ఆవులు, నిందితులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే మరుసటి శనివారం తెల్లవారేసరికి ఆవులు, నిందితులు, ఆటో కనిపించలేదు. విచారణ చేయకుండానే పోలీసులే వారిని వదిలేశారంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. శనివారం రాత్రి సోషల్ మీడియాలో ఈ వార్త వైరల్ అవుతుండడంతో ఈ విషయం బయటపడింది.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొలిమిగుండ్ల: బెలుం గుహల సమీపంలోని హోటల్ వెనుక భాగంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కోట సూర్యనారాయణరెడ్డిను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే పెట్నికోటలోని రామాలయం వద్ద బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి రూ.4140 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

చోరీ కేసులో యువకుడి అరెస్టు

డోన్ టౌన్: మండలంలోని దొరపల్లె గ్రామానికి చెందిన యువకుడిని అనంతపురం తాలూకా పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అనంతపురంలో దొంగలించిన బంగారంలో 20 తులాల వరకు ఈ యువకుడు కొని పాతపేటలోని బంగారు వ్యాపారులకు విక్రయించినట్లు సమాచారం. విచారణలో భాగంగా అనంతపురం తాలూక పోలీసులు దొరపల్లె యువకుడిని అరెస్టు చేసి తీసుకెళ్లారు.

ప్రమాదాలకు రహదారి

- 544–డీ జాతీయ రహదారిపై గుంతలు
- ప్రయాణికుల అవస్థలు



తుమ్మలపెంట క్రాస్ రోడ్డులో ఏర్పడిన గుంతలు



అంకిరెడ్డిపల్లె సమీపంలో..

కొలిమిగుండ్ల: ఈ ఫొటోల్లో గుంతలు పడిన రోడ్డు ఆర్‌అండ్‌బీ రోడ్డు కాదు..544–డీ అనంతపురం–అమరావతి జాతీయ రహదారి. ఈ మార్గంలో రోజుకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. మండల పరిధిలోని తుమ్మలపెంట క్రాస్ రోడ్డు సాయిబాబా ఆలయం, అంకిరెడ్డిపల్లె సమీపంలో ఏర్పడిన గోతుల వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి దారుణంగా మారింది. రాఘవరాజుపల్లె, కనకాద్రిపల్లె మీదుగా ఇటిక్యాల వరకు అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఎన్‌హెచ్ అధికారులు గుంతలు పడ్డ చోట ప్యాచింగ్ పనులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

కొనసాగుతున్న పాలేరు ఉధృతి

సంజామల: పాలేరు, గొల్లలేరు వాగులో నీటి ప్రవాహం కొనసాగుతోంది. ముదిగేడు సమీపంలో బ్రిడ్జిపై నీరు పారుతోంది. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ రెడ్డి గోవింద్, వీఆర్వో గుర్రప్ప శనివారం పాలేరు వాగును పరిశీలించారు. బ్రిడ్జిపై అధిక సంఖ్యలో గుంతలు ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్న పరిస్థితిని గమనించారు. నీటి ఉధృతి తగ్గుముఖం పట్టిన వెంటనే గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వంతెనపై ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్